# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 14-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత వాతావరణ శాఖ 150వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'మిషన్ మౌసం'ను ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు.**
2. **ఈ రోజు మకర సంక్రాంతి పర్వ దినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.**
3. **సంక్రాంతి పండుగ దృష్ట్యా రేపు జరగాల్సిన యుజీసీ ఎన్ఈటీ డిసెంబర్ 2024 పరీక్షను జాతీయ పరీక్షల సంస్థ వాయిదా వేసింది.**
4. **రాష్ట్రానికి చెందిన 2021-22 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**
5. **సైనిక దళాల దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకొంటున్నాం.**

**============================**

దేశ వైజ్ఞానిక ప్రయాణానికి చిహ్నంగా భారత వాతావరణ శాఖ -ఐఎండి నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. భారత వాతావరణ శాఖ 150వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'మిషన్ మౌసం'ను ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఎండి సాధించిన విజయాలను పురస్కరించుకుని ప్రత్యేక తపాలా స్టాంపును, స్మారక నాణెంను విడుదల చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ఐఎండి యొక్క 150 సంవత్సరాల ప్రయాణం శాస్త్ర సాంకేతిక రంగాలలో భారతదేశం యొక్క పురోగతికి అద్దం పడుతుందని ప్రధాన మంత్రి ఉద్ఘాటిస్తూ..

..వాయిస్... 40 సెకన్లు

---------------------------

ఈ రోజు మకర సంక్రాంతి పర్వ దినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. సూర్యుడు ఒక రాశి నుండి మరొక రాశిలోకి ప్రవేశించే సమయాన్ని సంక్రాంతి అంటారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. అందమైన రంగ వల్లులు, హరిదాసు కీర్తనలు, ఎడ్ల పందాలు, ఎగిరే పతంగులతో పల్లెటూళ్ళు కళకళ లాడుతున్నాయి.

దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయంలో

అంతర్భాగమైనదని ఆయన అన్నారు.

-----------------------------

గుంటూరు జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పర్వదినాన్ని జరుపుకుంటున్నారు. నేటి యువతలో, విద్యార్థులలో మన సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన పెంచే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున గుంటూరు నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న సంబరాలలో ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సంబరాలలో భాగంగా కోలాటాలు, కోమ్ముమాయిద్యాలు, చెక్క భజనలు వంటి కార్యక్రమలతో పాటు యువతకు ఎంతో ఉత్సాహాన్నందించే సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల గురించి నగర పాలక సంస్థ కమీషనర్ మాట్లాడుతూ....

..వాయిస్ .. 26 సెకన్లు

-----------------------------

సంక్రాంతి పండుగ దృష్ట్యా రేపు జరగాల్సిన యుజీసీ ఎన్ఈటి డిసెంబర్ 2024 పరీక్షను వాయిదా వేసినట్లు జాతీయ పరీక్షల సంస్థ –ఎన్టిఎ ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థుల నుంచి వచ్చిన వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, తదుపరి పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని ఎన్టిఎ పేర్కొంది. కాగా ఈనెల 16వ తేదీన జరగాల్సిన పరీక్ష షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని వెల్లడించింది.

-----------------------------

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ట్యాంక్ విధ్వంసక గైడెడ్ క్షిపణి నాగ్ మార్క్–2 పరీక్షను రాజస్థాన్‌లోని పోఖ్రాన్ వేదికగా భారత్ విజయవంతంగా పూర్తిచేసింది. ఇది లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించగల క్షిపణి. మొత్తం మూడుసార్లు ఇది విజయవంతంగా లక్ష్యాన్ని తాకిందని అధికారులు తెలిపారు. క్షిపణి కనిష్ఠ, గరిష్ఠ పరిధి నిర్ధారణ అయిందని క్షిపణికి సంబంధించిన క్యారియర్ వెర్షన్–2ని కూడా పరీక్షించినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలతో నాగ్ ఆయుధ వ్యవస్థ మొత్తం భారత సైన్యంలో ప్రవేశించేందుకు సిద్ధమైందని రక్షణ మంత్రిత్వశాఖ ఒక అధికార ప్రకటనలో వెల్లడించింది.

-----------------------------

రాష్ట్రానికి చెందిన 2021–22 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేహౌండ్స్ విభాగంలో అస్సాల్ట్ కమాండర్లుగా ఉన్న ఈ బ్యాచ్ కు చెందిన అధికారులందరికీ ఎస్పీలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా నవజ్యోతి మిశ్రాను చింతపల్లి ఏఎస్పీగా, నంద్యాల ఏఎస్పీగా మందా జావళి అల్ఫోన్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజంపేట ఏఎస్పీగా మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, కాకినాడ ఏఎస్పీగా దేవరాజ్ మనీష్, తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్ కుమార్ చౌదరిని బదిలీ చేశారు.

-----------------------------

పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి 61వ వార్షికోత్సవాల సందర్భంగా ఈరోజు నుంచి ఫిబ్రవరి 14 వ తేదీ వరకు ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటి ఏర్పాట్లను చేస్తోంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు

రామాయణం గోవిందరావు తెలుపుతూ..

... వాయిస్..25 సెకన్లు

---------------------------

భారత సైన్యం యొక్క ధైర్య సాహసాలను ...., పరాక్రమాన్ని ..., ధీరత్వాన్ని గుర్తు చేసుకుంటూ ఈ రోజు సైనిక దినోత్సవం నిర్వహిస్తున్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత దేశానికి చివరి బ్రిటిష్ కమాండర్ ఇన్ చీఫ్‌గా వ్యవహరించిన జనరల్ ఫ్రాన్సిస్ బుచర్ నుండి లెఫ్టినెంట్ జనరల్ కె.ఎం. కరియప్ప 1949 జనవరి 15 వ తేదీన భారత సైన్యానికి కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా జనవరి 15 వ తేదీన సైనిక దినోత్సవం నిర్వహిస్తున్నారు. దేశ సరిహద్దులలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే భారత సైన్యం అందిస్తున్న సేవలను ప్రతి పౌరుడు స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

---------------------------

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నిర్దిష్ట అభ్యాసన ఫలితాలను మెరుగుపరచడం కోసం దశలవారీగా అమలు చేస్తున్న 'పర్సనలైజ్డ్ ఆడాప్టివ్ లెర్నింగ్ (పాల్) కార్యక్రమాన్ని మరికొన్ని పాఠశాలలకు విస్త రింపజేయాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు 524 ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తుండగా, తాజాగా 700 రెసిడెన్షియల్ పాఠశాలలకు విస్తరించాలని నిర్ణయించారు. కొత్తగా 352 కేజీబీవీ, 164 మోడల్ పాఠశాలలతో పాటు ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. పాల్ అమలు, ఇతర కార్యకలాపాలకు సంబంధించిన కార్యకలాపాలను పర్యవేక్షించడానికి జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సమగ్ర శిక్షా అన్ని జిల్లా విద్యా అధికారులు, అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్లను ఆదేశించింది.

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2024 సంవత్సరం డిసెంబరు 7 నుంచి 2025 సంవత్సరం మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే ఈ వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వంద రోజుల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి క్షయ వ్యాధిగ్రస్థులను గుర్తించడం, సత్వర వైద్య సేవలను అందించడం, నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల కింద పౌష్టికాహారం అందించడం వంటివి నిర్వహిస్తారు.

ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం మార్చి 24కు వారం రోజుల ముందు ఈ ప్రచార కార్యక్రమం పూర్తికానుంది. ఇందులో ఉత్తమ ఫలితాలు కనబరిచిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించనుంది.

=====================